రచన సచిత్ర మాసపత్రిక - జనవరి 1994

# సువర్ణాక్షరాలు

మనం చేసే ఉద్యోగపు స్థాయిని బట్టే మనం ఎదుర్కొనే కష్టాలు కూడా ఉంటాయని నవ్వుతూ అంటారు కొందరు. నిజమేనేమో!! చిన్న ఉద్యోగంలో జేరి ప్రభుత్వ ప్రతినిధిగా రకరకాల చాకిరీలు చేస్తూ, మధ్య మధ్య ప్రమోషన్ల కోసం పరితపిస్తూ, అవి అందక నిస్పృహ పడడం, ఆపైన విరాట్ స్వరూపంలో ఎదిగే ఖర్చులు చూసి అయోమయం అవడం, ఇంకా ఇంకా తరుముకు వస్తూ మీదకు దుముకుతున్న వయసుని చూసి బెంబేలు పడడం, ఏతా వాతా చేతికి అందిరాని సంతానాన్ని తల్చుకుని కుమలడం... ఎన్నని - ఎవరితో చెప్పుకుంటే తీరే కష్టాలివి!! అందుకు నేను జీవితంలో వెనకపడ్డ వాళ్ళ జాబితాలోని ప్రముఖుణ్ణని సరిపెట్టుకుంటూ వుంటాను.

ఈ మీమాంశలో కిందా మీదా అవుతుండగానే హఠాత్తుగా నాకు ప్రమోషన్ ఒకటి వచ్చి పడింది. నాకు ఆశ్చర్యం వేసింది! దానికి కారణం 'అమ్మ తరచు, మీరు పనిచేసే బ్యాంకింగ్ వ్యవస్థను దుమ్మెత్తి పోయడమే' అని తీర్మానించేశారు పిల్లలు.

నాకు పోస్టింగ్ తూర్పు గోదావరి జిల్లాలోని వేళంగి అనే చిన్న పల్లెటూరుకు వచ్చింది. ఆ విషయం విన్న వెంటనే నాకు ప్రమోషన్ వచ్చిన ఆనందంలో సగం హరించింది. మా ఆవిడా పిల్లలూ సరేసరి. చాలాసేపు తలలు పట్టుకుని కూర్చున్నారు, నాకు తెలుసు - సుమారు ముప్పై ఏళ్లుగా ఏ విద్యావంతుడూ పల్లెటూరు వెళ్లి ఉద్యోగం చేయడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడ్డం లేదు. ఇంకా ఇంకా భయపడి, వెనకడుగు వేస్తున్నాడు.... సజావుగా జీవించడానికి మన పల్లెటూర్లు సుముఖంగా లేవనీ అక్కడి మనుషుల్లో, వాతావరణంలో పరిశుభ్రత కన్నా కాలుష్యం పాలు ఎక్కువవుతోందనీ అనేవాళ్లే కన్పిస్తున్నారు. పిడుగుల్లా వుండే వాళ్లు పల్లెటూర్లో ఒకటి రెండు ఏళ్లు పనిచేస్తే పీనుగులై తిరిగి వస్తారని అన్న వాళ్లని నేను చూశాను: ఇందులో కొంత అతిశయోక్తి ఉన్నా - దాన్ని పూర్తిగా అబద్ధం అని కొట్టి పారేయలేం అన్పిస్తుంది.

"నాయనా ప్రసాదూ, తప్పదు, వేళంగి పోయిరా... ఆడపిల్లలు అత్తవారింటికి వెళ్లడానికి ఎందుకు వెనుకడుగులు వేస్తారో, ఎందుకు కళ్లు ఒత్తుకుంటారో మగజన్మ ఎత్తిన మనకు అనుభవంలోకి రానిది! కానీ ట్రాన్స్ఫర్ మీదా, ప్రమోషన్‌మీదా ఓ శుద్ధ పల్లెటూరు వెళ్లి, అక్కడ కొంతకాలం మనుగడ సాగిస్తే - అందులో దాగివున్న రహస్యం అర్ధమవుతుంది," అంటూ స్నేహితులు ఊరు గురించి చెప్పారు. వేళంగిని ఆంధ్రదేశపు కుబేరపట్నం అని

పిలుస్తారట!! ఊరు చిన్నదయినా ఊళ్లో ప్రతీ గడప ముందు లక్ష్మీదేవి అనేకానేక రూపాలతో సిరి వెదజల్లుతూనే వుంటుందట.ఆ వూరి పంట పొలాల్లో విత్తనాలు జల్లితే ధాన్యాలూ తదితర అపరాలు చేతికందకుండా ఎకాఎకీన బంగారమే పండుతుందిట. ఇక జనంలో కంచుకాగడా వేసి వెదికినా బక్క, సన్నకారు రైతులు మచ్చుకైనా కన్పించరుట! మొత్తం మోతుబరి రైతులేనట. అలా చెప్పి, చెప్పి, ఆఖర్న "నువ్వు అదృష్టవంతుడివి ప్రసాదూ... కాస్త హోదాని పక్కకు పెట్టి ఊళ్లో కామందులైన పదిమంది కమ్మవారిని పట్టుకున్నావంటే నీకు డిపాజిట్ల వర్షమే, చూసుకో! రీజినల్ ఆఫీసు రికార్డుల్లో నీ పేరు సువర్ణాక్షరాలతో రాసి పారేస్తారు." అంటూ నాకు హెచ్చరికలూ హితోపదేశాలూ గట్రా చేసి అంతటితో ఊరుకోకుండా నా పెట్టేబేడా సర్దడానికి ఉపక్రమించేశారు.

అయితే నాతోపాటు వేళంగి ప్రయాణం కట్టడానికి మొదట పిల్లలు మొరాయించేరు. కాలేజీ చదువులు పోతాయని, స్నేహితుల్లాంటి టి.వి., స్టార్ టీవీలు మిస్ అవుతామనీ ఎమ్‌సెట్ లాంటి పరీక్షలకు తర్ఫీదు పొందే అవకాశం వుండదనీ - ఏవేవో చెప్పారు. విజయ అయితే అప్పటికి చాలాసేపటి నుంచే పమిట కొంగుతో కళ్లు ఒత్తుకునే బృహత్ కార్యక్రమంలోనే నిమగ్నమైవుంది!! నేను నిశ్శబ్దంగా భుజంమీద చెయ్యి వేశాను. "ఆ ఊళ్లో మీరు నెగ్గుకు రాగలర్రా చెప్పండి. మీదేమో సుతిమెత్తని మనసు... ఆపైన మాటపడని మనస్తత్వమాయే" అని ఆగి, "పల్లెటూర్లల్లో అందరూ కాకపోయినా చాలామంది తిక్ స్కిన్డ్‌గా ఉంటారు. ఏ కష్టాలయినా భరించవచ్చు.... ఎలాంటి మనుషులతోనైనా నెగ్గుకు రావొచ్చు.. కానీ అవకాశవాదులతోటి రాగాద్వేషాలు రెండిటినీ ఎరగకుండా బండరాళ్లుగా బ్రతికేవాళ్లతో నెగ్గడం కష్టం!! ప్రపంచం మొత్తం డబ్బుమీదే నడుస్తోందనీ, నడుస్తుందనీ నమ్మేవాళ్లకు - ఒకటి కాదు, వేల నాలుకలు ఉంటాయంటారు. ఆలోచించండి".... అంది.

"బ్యాంక్ ఉద్యోగి అనగానే రోజూ చేతిలో డబ్బులు ఆడించేవాడని అర్థం... ముప్ఫైఏళ్లుగా నోట్లు ముట్టని రోజు లేదు డబ్బున్న వాళ్లతో, డబ్బు అవసరం ఉన్న వాళ్లతో నాజూగ్గా లావాదేవీలు నడపడమే బ్యాంక్ ఉద్యోగి ధర్మం. భయపడకు - నాకూ వేయి రూపాయిల నోటుకూ పెద్ద తేడా ఏంలేదు. ఎవరి జేబులో ఎంతకాలం వుండాలో - ఆ జేబులోంచి ఎప్పుడు బయటపడాలో ఆ నోటుకు ఎవరూ చెప్పనక్కర్లేదు. అలాగే మా ఉద్యోగస్తులకూనూ..." అంటూ అంటీ అంటనట్టు లీలా మాత్రంగా, అతి ముక్తసరిగా చెప్పబోయాను. అయినా విజయ ఊరుకోలేదు. జాగ్రత్తలూ, అతి జాగ్రత్తలూ, పరమ జాగ్రత్తలూ పదే పదే వివరంగా చెప్తూనే వుంది!!

అలా మా మధ్య చాలాసేపు వాదోపవాదాలు చిన్నగా సాగుతూనే వచ్చాయి. ఆమె నాకు నచ్చచెప్పాలని ప్రయత్నం చేస్తోందని తెలుసు!! అలాగే ఆమె భయాలన్నీ పటాపంచలు చేయాలనేదే నా ప్రయత్నం అనీ నాకు తెలుసు. అప్పటికే రాత్రి రెండయ్యింది. నిద్రకు

సూచనప్రాయమైన ఆవలింతలుఇద్దరకూ వస్తున్నాయి. మాటలు అసంపూర్తిగా వాక్యాలు వ్యాకరణ సూత్రాల్ని అధిగమిస్తూ తడబడుతున్నాయి. ఆకాశంమీద నుంచి చిన్న చిన్న చినుకులు రాలి నేలలోకి అదృశ్యమయినట్టుగా, నిద్రాదేవి అంచెలంచెలుగా మా శరీరంలోకి జొరబడుతున్నట్టుగా లీలగా మాత్రమే తెలిసి పూర్తిగా తెలుసుకునే లోపునే ఇద్దరం నిద్రమత్తు ముందు నిమిత్త మాత్రులమై చేతులెత్తేశాం!!

❖ ❖ ❖

నేను వేళంగి వెళ్లి మా బ్యాంక్‌లో జాయినయ్యాను. మా బ్యాంక్ చిన్నది.... స్టాఫ్ అంతా పోగేస్తే పదిమంది మాత్రమే. అలవాటుగా నాకళ్లు బ్యాంక్ భద్రతపై పరిగెత్తాయి. ఓ చిన్న హాలు... నాకో చిన్నరూమ్... వీధి వైపు నాలుగు కిటికీలు... తలుపులకు రక్షణగా ఐరన్ షట్టర్స్... రాత్రివేళ కాపలా ఉండడానికి ఓ నేపాలీ గూర్ఖా..... ముందు పెద్ద దొడ్డి... చిన్న ప్రహరీ గోడమీద, పెద్ద బోర్డు మూడు భాషల్నీ సంతరించుకుని వుంది. బోర్డు తలమీద 'మీ సేవలకే మేం ఉన్నది' అంటూ తాటికాయలంత అక్షరాలతో ప్రచారం వ్రాసి వుంది. ఇక నా అసిస్టెంట్ పేరు వైకుంఠం. ఆ ఊరి ఆసామి... నాకోసం కాఫీ తెప్పించాడు. నా బాగోగులడిగాడు. నేను రాకుండానే ముందు చూపుతో నాకోసం ఇల్లు మాట్లాడి వుంచాట్ట. నచ్చితే దిగి పొమ్మన్నాడు, అందులోకి. నేను అలవాటుగా బ్యాంక్ లెడ్జర్లు తిరగేస్తున్నాను. వైకుంఠం వైపు చూశాను. వైకుంఠం ఏమిటన్నట్టు నావైపు చూశాడు.

"ఇదేమిటి వైకుంఠం.....మన బ్యాంక్‌లో అదీ ఫిక్స్‌డ్‌లో మనీ వేసిన వాళ్లు ఇంతమందేనా? ఈ ఊరి గురించి చాలా గొప్పగా విన్నానే...."

"మా ఊరి జనాభాకు బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం తక్కువ సార్. ఎవరికి వాళ్ళే ఓ బ్యాంక్‌గా మారి స్వంతంగా వడ్డీలకు తిప్పుకుంటారు. లేదా కాకినాడా, రాజమండ్రీలు పోయి వ్యాపారాల్లో తమ డబ్బు గుప్పిస్తారు."

"ఆహా" అన్నాను. అప్పటికే మా హెడ్ ఆఫీసువాళ్లు పంపిన ఓ డి.ఓ. లెటర్ నా టేబుల్ మీద ఉంది. ఫైనాన్షియల్ యియర్ ముగియడానికి సమయం ఆసన్నమయింది కాబట్టి – ఏ ఏ బ్యాంకు అధికారి ఎంతెంత డబ్బును – డిపాజిట్ల రూపంలో సేకరించాలో చెప్పే పత్రం అది. ఆ మొత్తం లక్షలు దాటి పరిగెత్తుతోంది. ఇక్కడ సాధ్యాసాధ్యాలతో పని లేదు. హుకుం జారి అయ్యింది. అంతే!! తలబాదుకునో, కిందా మీదా పడో నడుం బిగించవల్సిందే!!

"ఎలా?" అన్నాను, నేను. ఆ కాగితాన్ని వైకుంఠం తీసుకుని చదివి చిన్నగా నవ్వేశాడు.

"మనల్ని కోటలో పాగా వేయమంటున్నారు. సాధ్యా సాధ్యాలు మాత్రం చూడరు."

"సరేనండీ." అన్నాడు వైకుంఠం.

అన్నట్టుగానే మర్నాడు ఆ ఊళ్లో వున్న సర్పంచ్ మొదలు, పెద్ద పెద్ద తలకాయల్ని ఏరి నాకు పరిచయం చేశాడు. వాళ్లల్లో చాలామంది నావైపు, 'నీలాంటి వాళ్లను చాలా

మందిని చూశాం' అన్నట్టుగా ఓ నవ్వుతో నమస్కారంతో చెప్పారు. కొందరు ధాన్యం ధర పలకడం లేదనీ, మరికొందరు ఎరువులుకు సబ్సిడీ ఎత్తేసిన మూలంగా అవస్థలు పడుతున్నామనీ, ఇంకొందరు తగ్గిన బ్యాంక్ వడ్డీ రేటుతో గిట్టుబాటు కాదనీ అనేశారు. చదువుకున్న యువకులు ముఖ్యంగా నిరుద్యోగులు, 'తిరిగి బ్యాంకులన్నీ ప్రయివేటు పరం చేస్తారుట నిజమేనా' అని అడిగారు. రోజూ పేపర్లు చదివి స్కేమ్ గురించి తెలిసిన వాళ్లు, 'హర్షద్ మెహతా మీ బ్యాంక్‌ని ఎంత చేటు ముంచాడని' యక్ష ప్రశ్నలు వేశారు.

"వ్యక్తులమీద అపనమ్మకంతో వ్యవస్థను తూలనాడడం అన్యాయం" అంటూ నేను చిన్నరకం ఉపన్యాసం యిచ్చాను.

ఒకటి రెండు నెలలు గడిచాయి. నా డ్యూటీ నేను చేసుకుంటూ పోతున్నాను. తప్పడం లేదు. బ్యాంక్ రుణాల కోసం వచ్చే వాళ్లలో చాలామంది వ్యాపారస్తులేనని - వాళ్లు లేని లేమిని నటిస్తున్నారనీ నాకు తెలుసు. అయితే కొంతమంది నిజమైన అవసరాలతో బ్యాంక్‌కి వస్తారు. పొలాల మీద రుణాలు, బర్రెల్ని, కొనుక్కుందుకు అప్పుకోసం .... తుఫాను తాకిడికి గురై ఆర్థికసాయం అడగడం కోసం! ఇంకో రకం మనుషులుంటారు తమకు అవసరం లేకపోయినా రాజకీయ నాయకుల వాగ్దానాలకు లోబడి అప్పు తీసుకోవడం అనేది జన్మ హక్కుగా భావించి రూల్స్‌నీ, రైట్‌నీ లెఖ్ఖచేయని వాళ్లు. ఏళ్ల సర్వీసులో రకరకాల జనాభాని చూశాను. కొద్ది మందికి తప్ప చాలామందికి బ్యాంక్ అనగానే తమ చెప్పుచేతల్లో నడిచేదనే చిన్న అభిప్రాయం వుంది. మా వెనకా, మా ముందు కూడా అలా మాట్లాడే వాళ్లు చాలామంది నాకు తెలుసు. అమాయకులైన జనాన్ని రుణాల మేళాల పేరిట బ్యాంక్‌ల మీదకు తోలి, లబ్ధిపొందే దళారుల సంగతీ నాకు తెల్సు. అందుకే బాధ అన్పిస్తుంది. మరీ బాధించే విషయం ఏమిటంటే, సాయంకాలం ఐదు గంటలు కాగానే బ్యాంక్‌కు అతి జాగ్రత్తగా తాళాలు వేసే మా ఉద్యోగస్తుల నోళ్లకు, ప్రభుత్వం పగలంతా, అదే ఆరుగంటలసేపు సర్కారీ తాళాలు వేసి పని చేయించడం... ఏం చేస్తాం?.. ఏం చేయలేం! అంతే!!

సరిగ్గా ఆ సమయంలోనే వైకుంఠం 'సార్' అంట పిలుస్తూ నా గదిలోకి వచ్చాడు. నేను కుర్చీ చూపించాను. వైకుంఠం ఓసారి పైకీ, చుట్టుపక్కలా చూసి, కుర్చీలో అనీజీగా అటూ ఇటూ కదుల్తూ, చేతులు రెండు కలుపుకునీ, విడదీస్తూ ఏవేవో విన్యాసాలు చేస్తున్నాడు.

"ఏమిటి విషయం.."

"మీతో చిన్న పని ఉంది సార్, కాదనకూడదు..."

"అయితే నువ్వు చెప్పింది విని ఊరుకోమంటావ్... సరే కానీ..."

వైకుంఠం గుటకేసి, "మీ చేతుల మీదుగా ఈ రాత్రి ఓ మహత్కార్యం జరిపించాలి సార్..." అన్నాడు.

"ఏమిటీ, మన ఊళ్ళో కూచిపూడి భామాకలాపం ఏర్పాటు చేశారా, లేక చిట్టిబాబుని గానీ, చౌరాసియాని గానీ పిలుస్తున్నారా".

"అవేవీ కావు. హరిజనవాడలో ప్రేమికులు కులాంతర వివాహం ఒకటి జరుగుతోంది. వాళ్ళిద్దరూ ప్రేమికులు. ఆ విషయం పెద్దవాళ్ళకు చెప్పి మొదట భంగపడ్డారు. దాంతో వాళ్ళు విజృంభించి మువ్వన్నెల జండాకూ,ఎర్రజండాకూ కాపుకాసే మెరికల్లాంటి కుర్రాళ్ళతో అసలు విషయం చెప్పారు. యువత వెల్లువలా వెళ్ళి సమస్యకు పరిష్కార మార్గం చూపించారు. అటూ ఇటూ పెద్దలు, కిమనకుండా పెళ్ళికి సరే అన్నారు.

"అయితే ఆ కొత్త దంపతులకు అక్షంతలు వేసి, ఆ పైన ఊళ్ళో పెద్దతరం జనాభాకు నన్ను విరోధిని కమ్మంటావ్ అంతేనా?" అన్నాను చిన్నగా నవ్వేసి.

"అదేమో తెలియదు గానీ, ఇందుల్లో స్వామి కార్యం, స్వకార్యం రెండూ జతపడి ఉన్నాయి సార్" అంటూ వైకుంఠం ఆ పెళ్ళి చేసుకునే కుర్రకారు యొక్క పూర్వాపరాలు చెప్పాడు. వారివారి కుటుంబాల్లోని పెద్దల గురించి వివరించాడు. పెద్దవాళ్ళు పెళ్ళికయితే ఒప్పుకున్నారట గానీ సాంప్రదాయాల సరిహద్దుల్ని కించత్ జవదాటడానికి ఇష్టపడలేదు. కట్నాలు ముచ్చట్లు, ఆ పై మాట పట్టింపులు షరా మామూలే చేశారుట. పైగా ఆడపెళ్ళి వారు అన్ని ఖర్చుల నిమిత్తం అరవై వేలు యివ్వడానికి ఒప్పుకున్నారు. కానీ వాళ్ళ మనసులో అబ్బాయి తల్లిదండ్రుల మీద అనుమానం పోలేదు. మొదట్లో బీటలు పడిన మనసు కదా! కుర్రకుంకల మీద కోపంతో, మూడు ముళ్ళూ పడ్డ తర్వాత పైసా యివ్వకుండా మీదారి మీరు చూసుకోండని వియ్యాలవారు చెప్పేస్తే దిక్కెవరు? మళ్ళీ పంచాయతీ జరిగింది. పెద్దలూ పిల్లలూ చేరి - కట్నం రూపేనా వచ్చే డబ్బులో మూడొంతలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనీ, అదీ అబ్బాయి అమ్మాయిల పేర జాయింట్‌గా చెయ్యాలనీ - కేసుని పరిష్కారం చేశారు. అందుకని నేను శుభముహూర్తానికి హాజరయి, రెండు వైపుల వాళ్ళ మధ్యా సారథిలా నిలబడి, కొంచెం పెద్దరికం ప్రదర్శించి - ఆఖరిగా కుర్రవాళ్ళకు కర్పూరపు దండలు అందించి, దానికి బదులుగా నేనో దండ వేయించుకుని - కథకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పెట్టాలిట.

రాత్రి ఎనిమిది గంటలకు నేనూ, వైకుంఠం మరో నలుగురు స్టాఫ్ మెంబర్లతో కలిసి అంబేద్కర్ నగర్ వెళ్ళాను. ఆ వీధి ఎక్కడ వుందో వెదకనవసరం లేకపోయింది. ఎందుకంటే లౌడ్‌స్పీకర్ లోంచి సినిమా పాటలు జోరుగా హుషారుగా ఎక్కడికి రావాలో చెప్తున్నాయి. ఆ వీధిలో పది పది హేను ఇళ్ళు ఉన్నాయి. మొత్తం వీధిలో సగం స్థలాన్ని మింగేస్తూ షామియానా వేశారు.

మేం వెళ్ళేసరికి వధూవరులు మధుపర్కాలు కట్టి నుదుట భాషికాలు ధరించి పెళ్ళి పీటల మీద కూర్చుని వున్నారు. చుట్టూ కుర్రకారు - వాళ్ళ మీద జోకులు వేస్తున్నారు. రెండు వర్గాలుగా చీలి వేళాకోళాలు చేసుకుంటున్నారు. వైకుంఠం నాకు ఇరువైపుల

పెద్దల్నీ పరిచయం చేశాడు. వాళ్ళు నమస్కారాలు చేశారు. మొదట ఆడపిల్ల తండ్రీ – ఆ తర్వాత అబ్బాయి తండ్రీ విడివిడిగా నాతో మాట్లాడారు. వాళ్ళకే తెలిసిన భాషలో ఫిక్సిడ్ డిపోజిట్ గురించి! నేను ఆ పెద్దలిద్దర్నీ కూర్చోబెట్టి – అనునయించి చెప్పాల్సింది చెప్పాను. వాళ్ళ తలలూ ఊగాయి. ఇటు ముహూర్తకాలం కూడా దగ్గర పడింది. అక్కడ అప్పుడు అందరి కళ్ళల్లో విడమర్చి చెప్పలేని సంతోషం పురులు విప్పుకుని కన్పిస్తోంది. బ్రహ్మగారు చదివే మంత్రాలు, మంత్రముగ్ధంగా ప్రకృతిలోకి విలీనం అవుతున్నాయి. మనసు పెట్టి విని – ప్రమాణాలుగా చెప్పే మాటల్ని పెళ్ళి కొడుకూ, తిరిగి వప్పగిస్తుంటే, జన్మజన్మల బంధానికి కొత్త ముడులు పడుతున్నాయి!! విడదీయధాని చుట్టరికానికి వివాహ వేదిక సాక్షీభూతం. ఆహ్వానితులూ, బంధుమిత్ర సపరివారం అందుకు సాక్షులు. తంతు పూర్త య్యింది. భోజనాలు అయ్యాయి. జంటకు మా బ్యాంక్ తరఫున బహుమతులు అందజేశాను. వాళ్ళిద్దరూ నా దగ్గరగా వచ్చారు. నాకు నమస్కారం చేశారు.

"వీలయినంత త్వరలో మీరిద్దరూ మా బ్యాంకికు రావాల్సి వుంటుంది. భయపడకండి. ఆఫీసు టైములోనే! ఇక్కడిలా మా బ్యాంకులో పెద్ద తంతేం వుండదు. ఐదు నిముషాల పని. అంతా తెలుసుగా..." రాధిక నవ్వింది.. ఆ నవ్వుకు ఆమె బుగ్గల్లో సొట్ట తళుక్కుమంది. వేణు చిటికెన వేలు పట్టుకున్న రాధిక వేళ్లు ఏం చేశాయోఏమోగాని – వేణు తేరుకుని – వేణుగానం లాంటి నవ్వుకు ప్రాణం పోశాడు. ఆ పైన "అలానే సార్" అన్నాడు.

"శుభం... మంచిది" అన్నాను. చటుక్కున ఆ యిద్దరు నాకు వీడ్కోలుగా వంగి పాదాలు తాకారు! నేను ఆశ్చర్యపోయాను – వాళ్ళ అభిమానానికి.

❖ ❖ ❖

ఫిక్సిడ్ డిపాజిట్‌లో ముప్పై వేలు వేయడానికి రాధికా, వేణూ అన్న టైముకు వచ్చారు. ఆ విషయం ముందే తెలిసిన మూలంగా మా ఉద్యోగస్తులు వాళ్ళను సాదరంగా ఆహ్వానించారు. ఎందుకంటే రెండు విధాలుగా వాళ్ళు మాకు ఆదర్శనీయులు. మొదటిది వాళ్ళు కులాంతర వివాహం చేసుకుని సమాజం కొంతలో కొంతైనా ముందుకు పోవటానికి దోహదపడ్డారు. రెండవది మా ఖాతాదారులుగా మారారు.

"ఎలా వుంది – నూతన జీవితం"

రాధిక సిగ్గుతో తలవంచింది. వేణు మాత్రం 'బాగానే వున్నామండి' అన్నాడు. అప్పటికే వైకుంఠం ఫిక్సిడ్ డిపాజిట్ చేసేందుకు అవసరమైన అప్లికేషన్ ఫారం తయారు చేశాడు. నేను ఫారం చెక్ చేసి ఎక్కడ సంతకాలు చేయాలో చూపించాను. రాధిక సంతకం చేసింది. ఆమె అక్షరాలు తిలక్ వ్రాసినట్టు 'వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లల్లాగే' ఉన్నాయి. వేణు వైపు చూసి 'సంతకం చెయ్యి' అన్నాను. వేణు తెల్లబోయి నా మొహంలోకి చూసి, 'సార్ నేను చదువుకోలేదు వేలు ముద్రవేస్తాను..." అన్నాడు తలవంచుకుని. నేను ఆశ్చర్యపోయి, 'అరే' అనేశాను.

రాధిక ఎస్.ఎస్.సి. పాసయ్యింది. "చిన్నప్పటి నుంచీ నాకు వ్యవసాయపు పన్ల తోనే సరిపోయేది. బడికి పొమ్మని నన్నెవరూ ప్రోత్సహించలేదు.నిజానికి నేను మా ఇంట్లో అక్షర జ్ఞానం లేని మూడోతరం మనిషిని."

నేను అతను నొచ్చుకోకుండా ఉండాలని, "ఫరవాలేదు. నువ్వు సంతకం చేయవల్సిన చోటు ఖాళీగా వుంచుదాం. వారం పది రోజుల్లో సంతకం చేయడం నేర్చుకుని రా. ఆమె సంతకం చేయడం నువ్వు వేలిముద్రలు వేయడం నాకు ఇష్టం అన్పించడం లేదు. ఏమంటావ్?" అన్నాను.

వేణు ఆలోచిస్తున్నాడు.

నాకు తెలుసు. నేను కొంత నా అధికార హోదాని దుర్వినియోగపరుస్తున్నాను. కానీ అతను భార్య ముందు ఎల్లకాలం నిశానీదారుడిగా వుండిపోవడం నాకెందుకో నచ్చలేదు. మగవాడు, అందునా వ్యవహారవేత్తగా ఎదగాల్సిన యువకుడు అజ్ఞానిగా మిగిలిపోకూడదు. నా భావాన్ని వాళ్ళకు విడమర్చి చెప్పాను. వేణు తల ఊపాడు. రాధిక తన కేరీబాగ్‌లోంచి ముప్పై వేలు తీసి నా టేబుల్ మీద పెట్టింది. వైకుంఠం మిగతా పన్లు చకచకా పూర్తి చేశాడు.

❖ ❖ ❖

వారం రోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రం నేను ఇంటి దగ్గరే పుస్తకం తిరగేస్తూ వుండిపోయాను. విజయ పిల్లల పరీక్షలని – హైదరాబాద్ వెళ్ళింది... ఇంతలో, "దండాలు బాబయ్య" అంటూ వీరయ్య గేటు తెరుచుకుని లోపలికి వచ్చాడు. అతను నాకు గుర్తే... రాధిక తండ్రి.

"కూర్చో వీరయ్యా".

వీరయ్య భుజం మీది తుండుగుడ్డతో మొహం వత్తుకుని కుర్చీలో నమ్రతగా కూర్చున్నాడు. కాళ్ళు రెండు దగ్గరగా పెట్టుకున్నాడు.

"ఏమిటి విశేషం, కోతలూ, కుప్ప నూర్పిడులూ అయినట్టేనా?"

"అన్నీ బాగానే జరిగిపోనాయయ్యా. ఒక్కటే మిగిలిపోనాది"

"ఏమయ్యింది"

"మా వియ్యంకుడు చంద్రిగాడు నిన్న రాత్రి నా మీనకు దండెత్తుకొచ్చాడు బాబు గోరూ... ఆడూ అలా ఇలా మాట్లాడనేదు. కత్తెట్టి పొడిసేసినా బాగుండిపోయేది"

"ఏం జరిగింది?"

"వాడి పిల్లగాడికిచ్చిన కట్నంలో సకం బ్యాంకిలోఎట్టడానికి పెద్దల ముందు ఒప్పందం అయినాది కదా బాబూ... నిన్న లగెత్తుకొచ్చి – 'నువ్వూ నీ కూతురు బ్యాంకి ఆసామీ కుమ్మక్కయ్యారు' అన్నాడు. మీరు ఆ సర్కారు కాగితాల మీద నా రాధమ్మ తల్లి సంతకం ఒకటే ఎట్టించుకున్నారనీ ఒకటే నస..."

నాకు వీరయ్య చెప్పిన మాటలు అర్థం కాలేదు. అయినా జరిగింది టూకీగా చెప్పాను. వీరయ్య అంతా విని, "ఆళ్ళ బుర్రల్లో ఏరు పురుగు దొలుస్తోందయ్యా... నేకపోతే అంతలేసి తిట్లా నా పిల్ల కాపురం బుగ్గయి పోద్ది బాబు – చంద్రిగాడికి మీరే నచ్చచెప్పాల" అంటూ కుర్చీ దిగి నేలమీద చతికిలబడి బావురుమన్నాడు – వీరయ్య.

నేను వీరయ్యను ఓదార్చాను. 'దండాలు బాబయ్యా' అంటూ వీరయ్య వెళ్ళాడు. నేను భోజనం చేసి, నోట్లో వక్క పలుకు వేసుకుని సిగరెట్టు అంటించాను. మెట్లు దిగి ఆకాశం వైపు చూస్తే బహుళ పంచమి జోత్స్న నిజంగానే భయపెడుతోన్నట్టుగా వుంది. నిశ్శబ్దంలో అందం, భయం రెండూ ఉన్నాయేమో! అంతలోనే 'సార్' అంటూ మా వైకుంఠం గొంతుక వినబడింది. అతని వెనుక ముగ్గురు మనుషులున్నారు. అందులో ఒకాయన చంద్రయ్య. వేణు తండ్రి.

వైకుంఠం నెమ్మదిగా నా దగ్గరకు వచ్చి నాకు తప్ప మరెవరికీ వినబడనంత రహస్యంగా వీరయ్య చెప్పిన విషయాలే క్లుప్తీకరించాడు. ఇంతలోనే మా మధ్యకు ఓ కొత్త మనిషి వచ్చి, "మీరు బ్యాంకి ఆఫీసరు అయ్యుండీ చంద్రయ్య కుటుంబంలో నిప్పులు పొయ్యాలని చూస్తున్నారా. ఇలా మీరు ఒకళ్ళ తరపున వకాల్తా తీసుకుంటారా" పెద్ద కంఠంతో అన్నాడు.

"మీరు కూర్చుంటే అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు. నేను జరిగింది చెప్తాను. మీ అనుమానాన్ని నివృత్తి చేస్తాను"

"ఇంకా కూర్చునే ఓపిక ఎక్కడుంది! ఆ పెద్ద మనిషి కట్నం ఇచ్చినట్టే యిచ్చి అందులో సగం తన కూతురు పేర జమ అయ్యేటట్టు చూసుకున్నాడు. మీరేమో కాగితాలు సృష్టించారు. ఈ గవర్నమెంటు ఉద్యోగస్తులందరూ ఇంతే. వాళ్ళ వాటా కోసం ఏ గడ్డి అయినా తింటారు".

"నాకు మాట్లాడే అవకాశం ఇస్తారా..." అన్నాను.

"పెళ్ళికి ఈ పెద్ద మనిషి వచ్చినపుడే నాకనుమానం వేసింది బావా. ఈ సంబంధానికి తల ఊపద్దంటే నువ్వు విన్నావు కాదు. ఆ పిల్ల చదువున్నది. వీరయ్యగాడేమో గడసరి. ఇంక వీళ్లేమో చదువుకున్న మధ్యవర్తులు. గొప్ప నాటకం... గొప్ప నాటకం.."

నాకు ఏం మాట్లాడాలో తెలియలా!! వైకుంఠం పరిస్థితి కూడా అలాగే ఉంది. వచ్చిన ముగ్గురూ పెద్ద తుఫాను సృష్టించి – వాళ్ళ పని పూర్తి చేసుకుని – ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వెళ్ళిపోయారు.

"సార్ నా కనుమానం – మీ మాటల్ని వేణు సరిగ్గా అర్థం చేసుకోలేదేమో..."

"కుర్రవాడు అలా కనబడలేదు.." అన్నాను.

వైకుంఠం రకరకాల భయాలు, వెల్లడి చేస్తున్నాడు. నేను సిగరెట్లు కాలుస్తూనే ఉన్నాను.

❖ ❖ ❖

ఆ మర్నాడే నేను రీజినల్ ఆఫీసు నుంచి తాఖీదు వస్తే హైదరాబాద్ ప్రయాణ

మయ్యాను. మా బ్యాంక్ ఎంప్లాయీస్‌కు ఏర్పాటు చేసిన ట్రెయినింగ్ సెల్‌లో నెలరోజులు లెక్చర్లు యివ్వవలసి వచ్చింది. అది పూర్తి చేసి విజయనూ, పిల్లల్నీ చూడవచ్చుని మద్రాసులో పది రోజులు వుండిపోయాను. అలా అలా రెండు నెలలు గడిచాయి, నేను తిరిగి వేళంగి వచ్చేసరికి. వస్తూనే నేను వేణు గురించి వాకబు చేశాను. కానీ వేణూ, రాధికా కాకినాడలో వుంటున్నారని తెలిసింది. ఆ విషయం కూడా వైకుంఠమే చెప్పాడు.

అయితే నాలుగురోజులు గడవకుండానే - ఓ మధ్యాహ్నం లంచ్ అవర్లో వేణూ రాధికా నా గదిలో ప్రత్యక్షమయ్యారు. వాళ్ళకన్నా ముందే వారి నమస్కారాలు నన్ను తాకాయి.

"బావున్నారా? ఏవిటీ మన ఊరు వదిలేసి కాకినాడ మకాం మార్చారుట..."

"రాధికకు అక్కడ ట్రయినింగ్ కాలేజీలో సీటు వచ్చింది. స్టయ్‌ఫండు కూడా దొరుకుతుంది."

"రాధతో పాటే కృష్ణుడు కదా. అందుకని నువ్వూ వ్యవసాయానికి గుడ్‌బై కొట్టి ఉంటావు కదూ.."

వేణు నవ్వేసి, ఆ పైన ఏదో గుర్తువచ్చినట్టుగా మొహం పెట్టి, "సార్ నా వల్ల పొరపాటయ్యింది. మా ఫిక్స్‌డ్ డిపాజిట్ గురించి నేను ఇంట్లో చెప్పింది ఒకటి. వాళ్లు అర్థం చేసుకున్నది మరొకటీ..." అన్నాడు.

"అదేం లేదు వేణూ... భయం అన్నది చూడు దెయ్యం లాంటిది. కించిత్ చోటిచ్చామా అది మనలో మహావృక్షమై ఎదుగుతూ వుంటుంది. వాళ్ళ స్థానంలో నువ్వున్నా అదే చేసేవాడివి."

"మా వాళ్ళు మిమ్మల్ని తులనాడారుట కదా?"

"మీ నాన్నని పిల్చి కాగితాలన్నీ చూపించాను. నచ్చచెప్పాను..."

"అది సరే సార్. మా మూలంగా మిమ్మల్ని మీ పెద్దలు అదే సార్, మీ హెడ్ ఆఫీసువాళ్ళు ఎక్స్‌ప్లనేషన్ అడిగారనీ పైగా... " రాధిక మాటలు ఆపి నా మొహంలోకి చూసింది.

"ఇవన్నీ నీకెలా తెలిశాయి..."

"మా స్నేహితురాలి తండ్రి - మీ బ్యాంక్‌లోనే పనిచేస్తున్నాడు. ఆయనే చెప్పారు - కాకినాడలో ఈ విషయం..."

"ఏదో జరిగిందిలే! నేను చేసింది మంచి హృదయంతో అయినా రూల్స్‌ని కాస్తంత వయిలెట్ చేశాను కదా... నా రిప్లయి నేను పంపాను.."

"ఇంతకీ ఈ గొడవ ఎవరివల్ల పై దాకా పొక్కిందో మీకు తెలుసా సార్" రహస్యంగా అడిగాడు వేణు.

"ఎవరో ఒకళ్ళు చేసుండచ్చు..."

"ఎవరో కాదు సార్... మీ అసిస్టెంట్ వైకుంఠమే..."

నేను ఆశ్చర్యపోయాను.

"అవును సార్... వైకుంఠం మా చుట్టం... పదేళ్ళుగా యిక్కడే పనిచేస్తున్నాడు. ట్రాన్స్‌ఫర్ చేస్తే చచ్చినా కదలడు. అందుకు మా ఊరి పెద్దలు సహాయపడతారు. పైగా తనకు ప్రమోషన్ ఎప్పుడో రావాల్సి వుందనీ - రాలేదని దుగ్ధ.... దాంతో ఇలాంటి పన్లు చేస్తూంటాడు..." రాధిక చెబుతోంది.

వేణు కాస్తంత ముందుకు వంగి "సార్ మా ఫిక్స్‌డ్ డిపాజిట్ కాగితాలు ఓసారి చూపిస్తారా" అంటూ నెమ్మదగా అడిగాడు.

"ఏం? డిపాజిట్ విత్‌డ్రా చేసుకుందామనా... నోనో దానివల్ల మీకే నష్టం... ఇంట్రస్ట్ లాస్ అవుతుంది?"

"ఫరవాలేదు..." అన్నాడు.

నేను అల్మైరా తెరిచి - ఫైళ్ళు తిరగేసి - రాధికా వేణూ పూర్తి చేసిన ఫారాలు తీశాను. వాటిని వేణు చేతికి ఇచ్చాను.

"ఈ వేళ నేను సంతకం చేస్తాను. నేను రాత్రింబవళ్ళు కష్టపడి తెలుగు అక్షరాలన్నీ నేర్చేశాను..." అన్నాడు వేణు.

నేను ఆశ్చర్యపోయాను.

"అవును సార్. చదువు లేకపోవడం వల్ల ఆ వ్యక్తికే కాక చుట్టుపక్కల వాళ్లకు కూడా ప్రమాదమేనని నాకు ఈ రోజు తెల్సివచ్చింది. ఇంత చేటు దగా ప్రపంచంలో కాస్తంత మంచిగా బ్రతకాలంటే ఒడ్డూ, పొడుగూ పెర్సనాలిటీ చాలవని రాధిక చాలాసార్లు అనేది. అప్పట్లో నాకు అర్థం కాలా... పూర్వంలా, పొలంలో నాట్లు వేయడం, మడి కట్టడం, ఎడ్లతో పొలం దున్నించడం క్వాలిఫికేషన్స్‌గా వుండేవి. ఆ హోదాతోనే మనుషులు సుఖ జీవనం చేసేవారు. ఇప్పుడు ఈ లోకంలో బ్రతికి బట్టకట్టాలంటే కనీసపు చదువు అవసరం ఎంతైనా వుంది" వేణు ఆవేశంగా అన్నాడు. అతని కళ్ళల్లో ఓ వెలుగుతో పాటు కాస్తంత కన్నీటి తేమ కూడా కన్పిస్తోంది. అతని మొహంలో నిజాయితీతో పాటు పిసరంత ఆవేదన కూడా తేలి ఆడుతోంది!

"దట్సాల్... మంచే జరిగిందిగా... ముందు సంతకం చెయ్యి..." అటూ కాగితం అందించాను.

వేణు నేను గుర్తు పెట్టిన చోట నల్ల సిరా పెన్నుతో చక్కగా ముచ్చటగా 'వేణు' అని సంతకం చేశాడు. అతను చేతివ్రాతగా భాసిల్లుతున్న ఆ అక్షరాలు - అప్పుడే భూమిలోంచి మొలకెత్తిన విత్తనాల్లా తళతళలాడుతున్నాయి.

❖